వృద్ధురాలు అదృశ్యం

దుర్గవ్వ(ఫైల్)

జగద్గిరిగుట్ట, జూన్25 : బంధువుల పెండ్లికి వచ్చిన ఓ వృద్ధురాలు కనిపించకుండా పోయింది. జగద్గిరిగుట్ట పోలీసులు తెలిపిన మేరకు.. రుడా మిస్త్రీనగర్ సమీపం వల్లభాయి పటేల్‌నగర్‌లో నివాసముండే కొత్తూరు జోహ పెయింటర్. అతడి కుమారుడి పెండ్లి ఈనెల 24న జరిగింది. ఈ వేడుకకు అచ్చంపేటకు లో ఉండే జోహ పిన్నమ్మ దుర్గవ్వ(75) వారింటికి వచ్చింది. వేడుక అనంతరం మంగళవారం ఉదయం చూడగా దుర్గవ్వ కనిపించలేదు. వెతికినా ఆమె ఆచూకీ దొరక్కపోవడంతో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కేపీహెచ్‌బీ కాలనీ, జూన్ 25 : విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా కూకట్‌పల్లి దయార్‌గూడ ప్రాంతాల్లో బుధవారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేయనున్నట్లు కూకట్‌పల్లి ఏఈ చైతన్య మంగళవారం తెలిపారు.

బస్సు పాసుల జారీకి 43 కేంద్రాలు

సిటీబ్యూరో, జూన్25(నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో 43 బస్సు పాస్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు ఈడీ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐటీ ఉద్యోగులు, జేఎన్‌టీయూ విద్యార్థుల కోసం కొత్తగా జేఎన్‌టీయూ బస్టాపులో బస్సు పాస్ కౌంటర్ తెరిచామని చెప్పారు. ఈ కేంద్రాలు ఉదయం 6:30నుంచి రాత్రి 8:15 గంటల వరకు సేవలందిస్తాయన్నారు. గ్రీన్ మంత్లీ ఏసీ బస్సు పాస్‌లు కూడా జారీ చేస్తున్నట్టు వివరించారు. కాగా డిమాండ్ దృష్ట్యా మొబైల్ వెహికిల్ బస్సు పాస్ సేవలను కూడా అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

బీకాం ఆరో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షా తేదీలు ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 25 : ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో వాయిదా పడిన బీకాం ఆరో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షా తేదీని ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. 2017, 2018 బ్యాచ్‌లకు చెందిన రీ – అడ్మిషన్ తీసుకున్న అభ్యర్థులకు ఈ నెల 13న నిర్వహించాల్సిన పరీక్షను వాయిదా వేసిన విషయం తెలిసిందే. ఈ పరీక్షను తిరిగి వచ్చే నెల 2న మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్షా కేంద్రాల్లో ఎటువంటి మార్పు ఉండబోదని స్పష్టం చేశారు.

ఐదేండ్ల ఎమ్మెస్సీ కెమిస్ట్రీ పరీక్షా తేదీలు ఖరారు

ఓయూ పరిధిలోని ఐదేండ్ల ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ కెమిస్ట్రీ పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షలను వచ్చే నెల 2వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

నిరుపేద విద్యార్థికి ఆర్థిక సాయం

సుభాష్‌నగర్ డివిజన్ పరిధి ఎస్ఆర్‌నాయక్ నగర్‌కు చెందిన కడిమి దుర్గా ప్రసాద్ రెండు కిడ్నీలు చెడిపోయి మృతి చెందాడు. కుమార్తె శరణ్య చదువు కోవడానికి ఆర్థిక ఇబ్బందులు పడుతుండటంతో స్థానిక నాయకులు బొబ్బా ప్రసాద్ తన అల్లుడు వాసిరెడ్డి గౌతం తన కుమార్తె శశికి తెలియజేశారు. ఈ సందర్భంగా శరణ్య చదువు నిమిత్తం రెండు సంవత్సరాల ఫీజు రూ.44వేలను టీవీఆర్ మోడల్ స్కూల్ యాజమాన్యంకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీవీఆర్ మోడల్ స్కూల్ డైరెక్టర్ వంశీ కృష్ణారెడ్డి, స్థానిక నాయకులు గుబ్బల లక్ష్మీనారాయణ, పితాని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

– జీడిమెట్ల, జూన్ 25

పేదలకు భరోసా.. సీఎం సహాయ నిధి

■ ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ


బాధిత కుటుంబానికి నిధుల మంజూరు పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

మియాపూర్, జూన్ 25 : సీఎం సహాయ నిధి పేదల ఆరోగ్యానికి భరోసాగా నిలుస్తున్నదని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. ఈ పథకంతో నిరుపేదలు తమ అనారోగ్యాలను నయం చేసుకుని జీవనోపాధితో కుటుంబ పోషణను కొనసాగించుకుంటున్నారన్నారు. కొండాపూర్ డివిజన్ మార్తాండ్‌నగర్‌కు చెందిన కళావతికి అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం సీఎం సహాయనిధి పథకం కింద మంజూరైన రూ.2లక్షల ఆర్థిక సాయం మంజూరు పత్రాన్ని బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే గాంధీ మంగళవారం తన నివాసంలో అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదరికంతో ఏ ఒక్కరు వైద్యానికి దూరం కాకుండా సీఎం సహాయనిధి ఆర్థిక తోడ్పాటునిస్తున్నదన్నారు. తన నిరంతర సేవల ద్వారా పేద ప్రజలకు కార్పొరేట్ దవాఖానలో ఉచితంగా వైద్యం పొందేలా ఈ సహాయం ఉపయోగపడుతున్నదని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు శ్రీనివాస్, అనిల్, సాంబయ్య, అనిల్, అక్కారావు పాల్గొన్నారు.

బోనాలకు దరఖాస్తు చేయండి

బోనాల పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించుకునేందుకు ప్రభుత్వ నిధులను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గాంధీ కోరారు. ఈ మేరకు శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని ఆలయ కమిటీల ప్రతినిధులు వేడుకల నిర్వహణ నిధులను పొందేందుకు గాను ఈనెల 30వ తేదీలోగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇందుకు గాను గుడి పేరు ఉన్న లెటర్ హెడ్, బ్యాంకు పాసు పుస్తకం జిరాక్స్, గుడి ఫొటోలు, దేవాలయ చైర్మన్/కార్యదర్శి ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులతో గడువులోగా దరఖాస్తు సమర్పించాలని ఎమ్మెల్యే గాంధీ కోరారు.

■ సమస్యలు పరిష్కరించాలి

ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజును కలిసిన పార్టీ కార్యకర్తలు, ప్రజలు

దుండిగల్, జూన్ 25 : ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు శంభీపూర్‌రాజును కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన ప్రజలు, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నేతలు మంగళవారం శంభీపూర్‌లోని ఆయన కార్యాలయం వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ తమ బస్తీలు, కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరగా.. ఎమ్మెల్సీ రాజు సానుకూలంగా స్పందించారు. ప్రజల సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా తాము పని చేస్తున్నామన్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు జీహెచ్ఎంసీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో వసతుల కల్పనకు కృషి

నిజాంపేట్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ధన్‌రాజుయాదవ్

ప్రభుత్వ పాఠశాలను సందర్శించి సమస్యలు తెలుసుకుంటున్న డిప్యూటీ మేయర్ ధన్‌రాజుయాదవ్, కార్పొరేటర్ సుజాత

దుండిగల్, జూన్ 25 : నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్(ఎన్ఎంసీ) పరిధి, నిజాంపేట్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వసతులు కల్పించేందుకు తనవంతు సహకారం అందిస్తానని ఎన్ఎంసీ డిప్యూటీ మేయర్ ధన్‌రాజు యాదవ్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభమైన నేపథ్యంలో మంగళవారం ఆయన 15వ డివిజన్ కార్పొరేటర్ సుజాతతో కలిసి పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలకు అదనపు తరగతిగదులు, బోర్‌వెల్, బెంచీలతోపాటు ఇతర వసతులు కల్పించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన డిప్యూటీ మేయర్ వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు. అనంతరం పీఎంశ్రీ నిధులతో పాఠశాలలో నిర్మిస్తున్న సైన్స్ ల్యాబ్ పనులను పరిశీలించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలపై మున్సిపాలిటీలో ఫిర్యాదు

కుత్బుల్లాపూర్, జూన్ 25: కొంపల్లి మున్సిపాలిటీ పరిధి జయభేరి కాలనీ ఓం శ్రీ పేర్ల అపార్ట్‌మెంట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు తమకు మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ మంగళవారం కొంపల్లి మున్సిపాలిటీ కార్యాలయంలో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జయభేరి పార్క్ లోని సుమారు ఆరు అపార్ట్‌మెంట్‌లో 300 ఫ్లాట్స్‌లో నివాసం ఉంటున్న ఏరియాలో అంతర్గతంగా రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ దీపాల సమస్యలతోపాటు దోమల బెడదతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని, వెంటనే తమ కాలనీలో మౌలిక వసతులు కల్పించేలా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం స్థానిక కౌన్సిలర్ జీవన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో కాలనీలో సందర్శించి సమస్యలను పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జయభేరి యూత్ మెంబర్ కొండపల్లి రాకేశ్, గుర్రం నవీన్, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పటేల్ కుంట పార్కులో కార్పొరేటర్ పర్యటన

వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని పటేల్‌కుంట పార్కులో అధికారులతో కలిసి కార్పొరేటర్ రోజాదేవి మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. పార్కులో పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్ టైల్స్, శౌచాలయాల మరమ్మతులు సహా ఇతర పనులను వీలైనంత త్వరగా పూర్తి చేసి మరింత సౌకర్యవంతంగా పార్కును తయారు చేయాలన్నారు. పార్కు పరిసరాలను సద్వినియోగం చేసుకోవాలని కాలనీవాసులను కార్పొరేటర్ రోజాదేవి కోరారు. కార్యక్రమంలో డీఈ జగన్, ఏఈ సంధ్య, చెన్నయ్య, కొండయ్య, రాంచంద్రయ్య, హన్మంతరావు పాల్గొన్నారు. డివిజన్ పరిధి వెంకటేశ్వర నగర్‌లోని 35 బ్లాక్ కట్ట మైసమ్మ దేవాలయ 17వ వార్షికోత్సవంలో కార్పొరేటర్ జగన్‌తో కలిసి కార్పొరేటర్ మాధవరం రోజాదేవి పాల్గొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు సంజీవరెడ్డి, రంగారావు, భాస్కర్‌రావు, ఆంజనేయులు, లక్ష్మయ్య, బాబు, బీంరాజ్, రాంబాబు, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

– మియాపూర్, జూన్ 25

విద్యార్థికి లయన్స్ క్లబ్ హోప్ చేయూత

విద్యార్థి విద్య నిమిత్తం లయన్స్ క్లబ్ ఆఫ్ హోప్ చేయూత నందించింది. ఈ నేపథ్యంలో మంగళవారం హుడా కాలనీలోని హోప్ కార్యాలయంలో విద్యార్థి అశ్రా సిద్ధితో కలిసి తండ్రి అమర్‌కు లయన్స్ క్లబ్ ఆఫ్ హోప్ వ్యవస్థాపకుడు కొండా విజయ్‌కుమార్ చేతులమీదుగా రూ.20వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కొండా విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. చదువుకు పేదరికం అడ్డురాకూడదనే ఆలోచనతో తమ క్లబ్ ద్వారా చేయూతనందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థి అశ్రా సిద్ధి తారానగర్ విద్యానికేతన్ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్నట్లు తెలిపారు.

–మాదాపూర్, జూన్ 25

ప్రకృతి వనరుల సంరక్షణ అందరి బాధ్యత

: అడవులు, వన్యప్రాణులు, పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని దూలపల్లి అటవీ అకాడమీ సంచాలకులు డా.ఎస్.జె.ఆషా, పంచాయతీరాజ్ శాఖ ఉప కమిషనర్ పి.రవీందర్ అన్నారు. మంగళవారం దూలపల్లిలోని ఫారెస్ట్ అకాడమీలో దూలపల్లిలో పంచాయతీ అధికారులకు పర్యావరణం, అటవీ, వన్యప్రాణి రక్షణపై రెండురోజుల శిక్షణ కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పంచాయతీ అధికారులు పర్యావరణాన్ని కాపాడాలని, అటవీ వనరుల సంరక్షణపై అవగాహన కలిగి ఉండాలన్నారు. జీవవైవిధ్య పరిరక్షణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలతోపాటు సింగిల్ యూస్ ప్లాస్టిక్ నియంత్రణపై చర్చించారు. ఈ సదస్సులో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న డివిజనల్ పంచాయతీ అధికారులు, కోర్సు డైరెక్టర్ పి.రామకృష్ణ, సహాయ అధికారులు వై.సుభాష్‌చంద్ర యాదవ్, ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

– కుత్బుల్లాపూర్, జూన్ 25

మహిళా దక్షిత సమితి కాలేజీ

విద్యార్థులకు ఫుడ్ పాయిజన్

కొండాపూర్, జూన్ 25 : చందానగర్ లోని మహిళా దక్షిత సమితి బన్సీలాల్ మలానీ కాలేజ్ ఆఫ్ నర్సింగ్, సుమన్ హాస్టల్ విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌కు గురై దవాఖానలో చికిత్స పొందుతున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జూన్ 23వ తేదీన హాస్టల్‌లో ఆహారం తీసుకున్న విద్యార్థుల్లో 21 మంది వాంతులు, విరేచనాలతో బాధపడటంతో హాస్టల్ యాజమాన్యం వెంటనే వారిని స్థానిక దవాఖానలో చేర్పించి చికిత్సనందిస్తున్నారు. కాగా, వారిలో ఆరుగురు పరీక్షలు ఉన్నాయని, దవాఖాన నుంచి డిశ్చార్జి అయ్యారని, మిగతా వారు చికిత్స పొందుతున్నట్లు దవాఖాన వైద్యులు తెలిపారు. కాగా ఫుడ్ పాయిజన్‌పై కాలేజీ యాజమాన్యాన్ని వివరణ కోరగా.. కలుషి మంజీర నీరు తాగడం ద్వారానే అనారోగ్యానికి గురయ్యారని, ఎలాంటి ఆహార కల్తీ లేదని తెలిపారు. ఈ విషయమై వాటర్ వర్క్స్ అధికారి నాగప్రియను వివరణ కోరగా.. కలుషిత నీరు సరఫరా అయితే తాగిన వారందరూ అస్వస్థతకు గురవ్వాలి, కానీ కేవలం కాలేజీ విద్యార్థులు మాత్రమే ఎలా ఇబ్బందులకు గురవుతారన్నారు. మంజీర సప్లయ్‌లో ఎలాంటి కలుషితంలేదని, పూర్తిగా స్వచ్ఛమైన నీటినే ప్రజలకు అందిస్తున్నామన్నారు.

రాంగ్‌రూట్లో వస్తే చర్యలు తప్పవు: ట్రాఫిక్ సీఐ

కొంపల్లిలో రాంగ్‌రూట్లో వచ్చిన వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న అల్వాల్ ట్రాఫిక్ సీఐ డి.నాగేశ్వర్‌రావు తదితరులు

కుత్బుల్లాపూర్, జూన్ 25 : వాహనదారులు ప్రధాన రహదారులపై రాంగ్‌రూట్లో వస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని అల్వాల్ ట్రాఫిక్ సీఐ డి.నాగేశ్వర్‌రావు హెచ్చరించారు. మంగళవారం కొంపల్లిలో ప్రధాన చౌరస్తాల వద్ద విధులు నిర్వర్తించి రాంగ్‌రూట్‌లో వచ్చిన ద్విచక్రవాహనదారులతో పాటు హెల్మెట్ లేకుండా, నంబర్‌ప్లేట్లు లేని వాహనదారులను అదుపులోకి తీసుకొని జరిమానాలను విధించి, కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐలు ప్రశాంత్‌రెడ్డి, ఎన్.శ్యామ్‌బాబుతో పాటు సిబ్బంది ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు

సమీక్ష సమావేశంలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కృష్ణారావు. చిత్రంలో కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి

బాలానగర్, జూన్ 25:ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనివ్వనున్నట్లు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని ఇందిరానగర్‌లో డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డితో కలిసి ఆయన పర్యటించి అక్కడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాలానగర్ వార్డు కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశానికి అన్ని విభాగాల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలో నెలకొన్న పలు సమస్యలపై స్థానికులు ఎమ్మెల్యే కృష్ణారావుకు వినతిపత్రాలు అందజేశారు. వాటిలో సత్తిరెడ్డికాలనీలో తాగునీటి పైప్‌లైన్ వేయాలని, విశాలయం ఎదురుగా హైటెన్షన్‌లైన్‌ను తొలగించాలని, వినాయక్‌నగర్‌లో డ్రైనేజీ సమస్య, చెరబండరాజునగర్‌లో డ్రైనేజీ సమస్య, రాజుకాలనీలో కమ్యూనిటీహాల్, నేతాజీకాలనీలో(జంగంగబస్తీ) కమ్యూనిటీ హాల్ రిఫేర్ చేయాలని, మందుల బస్తీలో రోడ్డు, తాగునీటి పనులు, కోమటిబస్తీలో డ్రైనేజీ, శానిటేషన్, రాజీవ్‌గాంధీనగర్, శ్రీశ్రీనగర్‌లలో తాగునీరు, డ్రైనేజీ సమస్య, ఇందిరానగర్‌లో తాగునీరు, రోడ్లు వేయాలని, దిల్‌కుశ్‌నగర్‌లో డ్రైనేజీ సమస్య, జేపీనగర్‌లో తాగునీరు, డ్రైనేజీ, ఎన్టీఆర్‌నగర్‌లో తాగునీరు, డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రాలు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించడానికి అధికారులు శ్రీకారం చుట్టాలని సూచించారు. ఆయా పనులకు కావాల్సిన పనులకు ఉన్నతాధికారుల ద్వారా అనుమతులు తీసుకొని నిర్లక్ష్యం చేయకుండా పనులు తక్షణమే ప్రారంభించాలని పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ, విద్యుత్‌శాఖ, జలమండలి, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఈఈ గోవర్ధన్‌గౌడ్, డీఈ బాలకృష్ణ, ఏఈ రషీద్, జలమండలి అధికారి షంషేర్, విద్యుత్‌శాఖ అధికారులు, బీఆర్ఎస్ నేతలు, బస్తీలు, కాలనీల ప్రతినిధులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

వీధికుక్కల పట్టివేత

వీధి కుక్కల బెడదను నివారించేందుకు చర్యలు చేపట్టినట్లు దుండిగల్ మున్సిపాలిటీ కమిషనర్ కల్వకుంట్ల సత్యనారాయణరావు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ఇటీవల వీధికుక్కల బెడద అధికమైన నేపథ్యంలో మంగళవారం పలు వార్డుల్లోని వీధి కుక్కలను పట్టుకున్న మున్సిపల్ సిబ్బంది వాటిని బ్లూక్రాస్ సొసైటీకి అప్పగించారు. ఎక్కడైనా శునకాల సంచారం అధికంగా ఉంటే తమకు సమాచారం అందించాలని, వెంటనే కుక్కలను పట్టుకుని స్టెరిలైజేషన్ సెంటర్‌కు పంపిస్తామన్నారు.

– దుండిగల్,జూన్ 25

కాలనీ సమస్యలు పరిష్కరిస్తా

ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎన్‌టీఆర్ నగర్‌లో కార్పొరేటర్ వెంకటేశ్ గౌడ్ మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో సీసీ రోడ్లు, పారిశుద్ధ్యం, విద్యుత్ సమస్యలను ప్రజలు విన్నవించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. కాలనీలో నెలకొన్న సమస్యలన్నింటినీ పరిష్కరించి మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. వర్షాకాలం నేపథ్యంలో యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కార్పొరేటర్ వెంకటేశ్ గౌడ్ కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

– మియాపూర్, జూన్ 25

కొంపల్లి విద్యాసంస్థలో

అనుమానాస్పద స్థితిలో విద్యార్థి మృతి

■ యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమంటూ బంధువుల ధర్నా
■ సెలవు ప్రకటించిన యాజమాన్యం
■ పోలీసుల మోహరింపు?

మల్లికార్జున్(ఫైల్)

కుత్బుల్లాపూర్, జూన్25:కూలీనాలి పనులు చేసుకొని బతికే ఓ కుటుంబ అప్పులు చేసి మరీ తన కొడుకును మంచి చదువులు అందించాలనే ఆశ ఆదిలోనే ఆవిరైంది. కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలకు ఫీజులపై ఉన్న మక్కువ విద్యార్థుల బాగోగులపై లేదన్న వాస్తవం ఇక్కడ బహిర్గతమైంది. వసతిగృహంలో ఉండే విద్యార్థులను కంటికిరెప్పలా కాపాడుకోవాల్సిన యాజమాన్యం, సిబ్బంది నిర్లక్ష్యంతో ఓ విద్యార్థి అనుమానాస్పద మృతికి కారణంది. ఈ సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొంపల్లి ఓ రెసిడెన్షియల్ స్కూల్‌లో చోటుచేసుకుంది. బాధితులు, తోటి విద్యార్థులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా అల్లాదుర్గా మండలం చిలువర గ్రామానికి చెందిన వడ్డె బీరప్ప మాధవి దంపతుల పెద్దకుమారుడు వి.మల్లికార్జున్(12) కొంపల్లిలోని ఓ రెసిడెన్షియల్ స్కూల్‌లో ఏడవ తరగతి చదువుతున్నాడు. హాస్టల్‌లో ఉంటూ ఇటీవల తల్లిదండ్రులను చూసేందుకు ఇంటికి వెళ్లి తిరిగి సోమవారం సాయంత్రం తనతో పాటుగా తన బంధువులు, స్నేహితులైన మరో నలుగురిని ఇదే క్యాంపస్‌లో చేర్పించడంతో వారితో కలిసి వచ్చాడు. సోమవారం రాత్రి క్యాంపస్–4లో రూమ్ నంబర్ డి–4లో కలిసి భోజనం చేసుకొని అందులోనే పడుకున్నాడు. కాగా, అర్ధరాత్రి నిద్రలో ఒక్కసారిగా గట్టిగా ఏడవడంతో తోటి విద్యార్థులు లేపే ప్రయత్నం చేశారు. కానీ లేవకపోవడంతో పడుకున్నాడని భావించి వదిలేశారు. ఉదయం వార్డెన్ వచ్చి పిల్లలను లేపగా ఎవరి పనులు వారు చేసుకుంటుండగా, మల్లికార్జున్ ఒక్కడే లేవలేదు. దీంతో లేపే ప్రయత్నం చేయగా.. స్పందన లేదు. వెంటనే పాఠశాల యాజమాన్యానికి ఫోన్ చేయగా.. హుటాహుటిన క్యాంపస్‌కు చేరుకొని మల్లికార్జున్‌ను సుచిత్రలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు విద్యార్థి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ఈ ఘటనతో పాఠశాలకు సెలవును ప్రకటించి ఎవరూ లోపలికి చేరకుండా పోలీసులతోపాటు ప్రైవేట్ సెక్యూరిటీని బందోబస్తుగా ఏర్పాటు చేశారు.

మాల్స్‌లో పోలీసుల తనిఖీలు

జన సమ్మర్ధ ప్రాంతాల్లో భద్రతా చర్యల్లో భాగంగా కేపీహెచ్‌బీ ఠాణా పరిధిలోని పలు వాణిజ్య మాల్స్‌లో మంగళవారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. సీఐ వెంకటేశ్వర్‌రావు నేతృత్వంలో పోలీసు సిబ్బంది, బీడీ బృందంతో నెక్సెస్ మాల్, లుల్లూ మాల్‌లలో తనిఖీలు చేపట్టారు. మాల్స్‌కు పెద్దఎత్తున ప్రజలు వస్తున్నందున భద్రతా అంశాలపై మాల్స్‌కు చెందిన భద్రతా సిబ్బంది మరింత అవగాహన నిమిత్తం ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించినట్లు సీఐ వెంకటేశ్వర్‌రావు తెలిపారు.

– కేపీహెచ్‌బీ కాలనీ, జూన్ 25

నాణ్యతతో పనులు పూర్తి చేయాలి

సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో బాలాజీనగర్ మాజీ కార్పొరేటర్ బాబూరావు పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని టీ అంజయ్య నగర్‌లో సీసీ రోడ్డు పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ.. వర్షాకాలం నేపథ్యంలో నిర్మాణ పనుల్లో జాప్యం లేకుండా పూర్తి చేయాలని, నాణ్యతలో రాజీపడొద్దని, వీలైనంత త్వరగా ప్రజలకు అందుబాటులోకి తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఖాజా పాషా, ఫయాజ్, ఖలీల్ పాష, మహబూబ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

– కేపీహెచ్‌బీ కాలనీ, జూన్ 25

అస్తవ్యస్తంగా వీధిలైట్ల నిర్వహణ

బీఎస్పీకాలనీలో పట్టపగలే వెలుగుతున్న వీధిలైట్లు

అల్లాపూర్, జూన్ 25 :అల్లాపూర్, మోతీనగర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో స్ట్రీట్‌లైట్ల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. అనేక చోట్ల పట్టపగలు స్ట్రీట్‌లైట్లు వెలుగుతుండటంతో పాటు మరి కొన్ని చోట్ల రాత్రిపూట పని చేయక చీకటిగా ఉండటంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. స్ట్రీట్‌లైట్ల సమస్యపై అధికారులు, సిబ్బందికి ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహిస్తున్నారని ఆరోపిస్తున్నారు. మోతీనగర్ పరిధిలోని బీఎస్పీకాలనీ సాయిసిద్ధార్థ స్కూల్ సమీపంలో స్ట్రీట్‌లైట్లు గత కొన్ని రోజులుగా పట్టపగలు వెలుగుతూ దర్శనమిస్తున్నాయి. గాయత్రినగర్ లైబ్రరీ పార్కు, సున్నం చెరువు పార్కుల్లో రాత్రిపూట లైట్లు వెలగకపోవడంతో పార్కులకు వచ్చే వారు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై జీహెచ్ఎంసీ మూసాపేట సర్కిల్ స్ట్రీట్‌లైట్ల విభాగం డీఈ, డివిజన్ సిబ్బందికి పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఆ ప్రాంతవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నార